క్లుప్తంగా

కమిటీ ఎన్నిక



చిట్యాల: బహుజన సమాజ్ పార్టీ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు దూడపాక సుమన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొన్నం భిక్షపతి గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సరిగొమ్ముల రాజేందర్, ఉపాధ్యక్షుడిగా అంకేశ్వరపు మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా రత్న విష్ణు, కోశాధికారిగా జోహర్‌లాల్ నాయక్, ఆర్గనైజర్ సెక్రటరీ సిద్దంకి భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా అజయ్, కిషన్, కుమార్ లను ఎన్నుకున్నట్లు సుమన్ వెల్లడించారు.

బోరు ఏర్పాటుకు సర్వే



కాటారం: కాటారం మండలం ప్రతాపగిరి గొంతెమ్మ గుట్టపై జరిగే జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలనే కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాల మేరకు బుధవారం తాగునీటి బోరు ఏర్పాటు కోసం జిల్లా జియాలాజికల్ అధికారులు గుట్టపై సర్వే నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి బోరు ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని పరిశీలించారు. ప్రత్యేక మిషన్ ద్వారా ఎక్కడ బోరు ఏర్పాటు చేస్తే నీరు ఉంటుంది అని పరీక్షించారు. అధికారుల వెంట ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు ఉన్నారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని దుబ్యాలలో మాసాడి లింగారావు బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంగి రవి పరామర్శించి, లింగారావుకు నివాళులర్పించారు. ఆయన వెంట దుబ్యాల సర్పంచ్ బిల్లకంటి ఉమేందర్‌రావు, ఎంపీటీసీ బిక్కినేని సంపత్‌రావు, కానుగుల లక్ష్మన్, సాల్లేటి రాజు, కొమురయ్య ఉన్నారు.

పనులు పూర్తి చేయాలి

నల్లబెల్లి: మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు. డీఈవో వాసంతితో కలిసి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దాతల సహకారంతో పాఠశాలలను మరింతగా అభివృద్ధి చేసేందుకు ఎస్ఎంసీ కమిటీలు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కార్పోరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.

తాగునీటికి ఇబ్బందులు



భగీరథ పైప్‌లైన్‌లో వచ్చిన బురద నీరు

మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని చిగురుపల్లి, అప్పలవాడ, బడితలవాడల్లో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు బుధవారం తెలిపారు. గ్రామంలో నిర్మించిన పంచాయతీ బోర్లు చెడిపోవడంతో పాటు మిషన్ భగీరథ పైప్‌లైన్‌ల లీకేజీల కారణంగా నీరు రావడం లేదన్నారు. దీంతో గత వారం, పది రోజులుగా తాగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. బడితల వాడలోని బోరు నుంచి బురద నీరు దర్శనమిస్తుందని వివరించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సాయిచరణను వివరణ కోరగా పల్లెవాసులకు తాగు నీటికి ఇబ్బందులు లేకుండా పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. రెండు, మూడు రోజుల్లో బోర్లకు మరమ్మతులు చేయించి, నీటి సమస్య పరిష్కరిస్తామని వెల్లడించారు.

ఆర్థికసాయం అందజేత

ఎస్ఎస్ తాడ్వాయి (గోవిందరావుపేట) : గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామానికి చెందిన సామ వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం పస్రాలోని ఆయన స్వగృహంలో జరిగిన పెద్దకర్మకు 1994–1995 పస్రా జెడ్పీహెచ్ఎస్‌లో ఆయనతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి రూ.22 వేల ఆర్థిక సాయం అందజేశారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన అవసరం



పలిమెల : అవగాహన కల్పిస్తున్న ఎస్సై అరుణ్



మహాముత్తారంలో..



చిట్యాల: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పలిమెల : విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని పలిమెల ఎస్సై అరుణ్ అన్నారు. బుధవారం ఆయన పంకెనలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై అరుణ్ విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ మోసాలు, ఓఎల్ఎక్స్ మోసాలు, మల్టీ లెవల్ మార్కెటింగ్, ఏటీఎం మోసాలు తదితర అంశాలపై వివరించారు. మొబైల్‌కి వచ్చే ఓటీపీలను ఎవరితో పంచుకోవద్దని తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కనకలక్ష్మి, సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మహాముత్తారం: ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీలో వస్తున్న విప్లవాత్మక మార్పుల వల్ల సైబర్ నేరాలు జరుగుతున్నాయని వాటిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఓటీపీ ద్వారా నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ ఫేస్‌బుక్ ద్వారా రిక్వెస్టులు పంపించి డబ్బులు లాగడం, లోన్ యాప్‌ల ద్వారా జరిగే మోసాల గురించి వివరించారు. అలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీసీ నవతారాణి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నకిలీ యాప్‌పై అప్రమత్తంగా ఉండాలి

చిట్యాల: సైబర్ నేరాగాళ్లు సృష్టించిన నకిలీ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలు, నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది హర్షితారెడ్డి మాట్లాడుతూ.. రోజు రోజుకు సైబర్ నేరగాళ్లు ప్రజలకు పలు రకాల లింక్‌లను, యాప్‌లను పంపిస్తూ మాయ మాటలు చెప్తూ మోసం చేస్తున్నారని తెలిపారు. ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌ని రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు.

విద్యార్థులకు అభినందన



విజేతలైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మల్హర్: వ్యాస రచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి, విద్యా కమిటీ చైర్మన్ గుమ్మడి రవి బుధవారం అభినందించారు. పుట్ట లింగమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి మాసోత్సవాల సందర్భంగా పాఠశాలల స్థాయిలో సావిత్రిబాయి పాత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 10వ తరగతి విద్యార్థినులు నిత్యశ్రీ ప్రథమ స్థానం, సాయిచరణ్య ద్వితీయ స్థానం సాధించి బహుతులు అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ం, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు వెంకట్‌కృష్ణ, సత్యనారాయణ, జయభాస్కర్, జగన్ నాయక్, శివలింగం, శ్రీనివాస్, స్వర్ణలత, సమత, మహేష్ వారిని అభినందించారు.

నియామకం



రమేష్



రాజు

భూపాలపల్లి అర్బన్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడిగా కస్తూరి రమేష్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పు కిషన్ ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పార్టీలో కమిటీ నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కస్తూరి రమేష్‌తోపాటు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కనుమల రాజులను నియమించినట్లు పేర్కొన్నారు. మాజీ ఈసెం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులు ఆయన మరణ అనంతరం కాంగ్రెస్ పార్టీలోనే పనిచేయడం జరిగిందన్నారు. షర్మిల ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీలో రమేష్ ప్రారంభం నుంచి సేవ చేస్తున్నారని, దీంతో ఆయనకు పదవి ఇచ్చినట్లు తెలిపారు. పనిచేసేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని అన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీఓ

కాటారం: మండలంలోని చింతకాని ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం కలెక్టర్ భవేశ్‌మిశ్రా సూచన మేరకు ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. పదో తరగతి బోర్డు పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.1,116 బహుమతిగా అందజేస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి మైల్ స్టోన్ అని, లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, పంచాయితీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెస్పీ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: మహాజన సోషలిస్టు(ఎమ్మెస్పీ) పార్టీ ఆవిర్భావ వేడుకలు బుధవారం జిల్లా కేంద్రంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాజుల భిక్షపతి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి, జిల్లా కన్వీనర్ గట్ల రాజన్నలు ముఖ్యఅతిథులుగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బొల్లిబాబు, నోముల శ్రీనివాస్, మేకల రమేష్, అంతడుపుల సురేష్, విజయలక్ష్మి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు సొమ్మును రుణంగా తీసుకోవద్దు

మహాముత్తారం: ప్రభుత్వం పంట సాయం కోసం రైతులకు రైతుబంధు పథకం ద్వారా వచ్చే డబ్బులను బ్యాంకు అధికారులు పాత రుణంగా జమ చేసుకోకుండా రైతులకు అందజేయాలని ప్రేమ్‌నగర్ సర్పంచ్ రమ్యవంశీరాజ్ తోపాటు గ్రామస్తులు కోరారు. ఇటీవల యాసంగి రైతుబంధు రైతుల ఖాతాల్లో జమకావడంతో పాతబాకీ ఉన్న కొంత మంది రైతుల అకౌంట్లను ఫ్రీజ్ చేసినట్లు వారు సాక్షికి తెలిపారు. బ్యాంకు అధికారులు రైతుల అకౌంట్లను ఫ్రీజ్ నుంచి తొలగించి పంట సాయం కోసం రైతుబంధు డబ్బులను రైతులకు ఇవ్వాలని కోరారు. రైతులకు పెట్టుబడి కోసం అందే సొమ్మును వెంటనే రుణాల కింద జమ చేసుకోవడం వల్ల అన్నదాతలు మళ్లీ ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారని వాపోయారు. కొంత మంది గ్రామస్తులు గత రెండు రోజుల మహాముత్తారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అకౌంట్‌లను పరిశీలించగా ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై మహాముత్తారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను సంతోష్‌ను వివరణ కోరగా మొండిబాకాయిల అకౌంట్లను గతంలోనే ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. కొంత మంది రైతుల ఇష్టానుసారంగానే డబ్బులను రుణాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు.

క్రైమ్ కార్నర్..

ఒకరికి 13నెలల జైలు

మల్హర్: దొంగతనం కేసులో వ్యక్తికి భూపాలపల్లి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి 13 నెలల జైలు శిక్ష విధించినట్లు కొయ్యూరు ఎస్సై నరేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. మండల కేంద్రం తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంలో జరిగిన దొంగతనం విషయంలో ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌రావు, పూజారి ప్రహ్లాద్‌శర్మలు 2021 సంవత్సరం సెప్టెంబర్ 8న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కరీంనగర్ జిల్లా రేకుర్తికి చెందిన తూర్పాటి మైస్య అలియాస్ మహేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా బుధవారం ఎస్సై నరేష్, కోర్టు పీసీ సతీష్‌లు మైస్యను, సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపావాదాలు విన్న అడిషనల్ జూనియర్ సివిల్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జీ రామచందర్ రావు నిందితుడి మైస్యకు జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్సై వెల్లడించారు. నిందితుడికి శిక్షపడటంలో కృషి చేసిన ఎస్సై నరేష్, సీఐ రంజీత్‌రావులను ఎస్పీ సురేందర్‌రెడ్డి అభినందించారు.

ఆరుగురిపై కేసు నమోదు

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి గ్రామానికి చెందిన పుల్యాల ఎర్రలచ్చయ్యను అదే గ్రామానికి చెందిన పుల్యాల రవి, కర్రె పోచయ్య, లచ్చయ్య, మహేష్, రాజు, కవిత కట్టెలతో కొట్టి గాయపర్చి తిట్టారు. దీంతో ఎర్రలచ్చయ్య ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఇదిలా ఉండగా.. పెగడపల్లి గ్రామానికి చెందిన పుల్యాల రాజయ్య అనే వ్యక్తిని పెగడపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల మధ్య డిసెంబర్ 31న డీజే బాక్స్‌ల విషయంలో జరిగిన సంఘటనలో రాజయ్యను అదే గ్రామానికి చెందిన రామగిరి రాజయ్య, శ్రీకాంత్, పుల్యాల నాగరాజు కొట్టి గాయపర్చారు. రాజయ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై బుధవారం మహాముత్తారం ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒకరికి గాయాలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ఎస్సీకాలనీలో బుధవారం బైక్ అదుపు తప్పి మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా నగరం గ్రామానికి చెందిన కోడి శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. కణత పైన తీవ్ర గాయం కాగా పోలీసులు అంబులెన్స్‌ను రప్పించి, మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఏటూరునాగారం: ఏజెన్సీ గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంతర్గత రోడ్ల అభివృద్ధి మూలంగా రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుతుందని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధి లోని హనుమాన్‌నగర్‌లో తన నిధుల నుంచి అందించిన రూ. 30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

వెంకటాపురం(ఎం): సీఎం సహాయ నిధి పేదలకు వరం అని జెడ్పీటీసీ గై రుద్రమదేవి, ఎంపీపీ బుర్ర రజిత అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నర్సింగాపూర్ గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మికి రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంపీపీ బుర్ర రజిత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడబోయిన అశోక్, బీఆర్ఎస్ నాయకులు ముడిగె రాజ్‌కుమార్, భాషబోయిన జ్ఞానేందర్, అంతటి రాము పాల్గొన్నారు.

ఆదివాసీ గర్జన సభను విజయవంతం చేయండి

వెంకటాపురం(కె): స్థానిక బస్టాండ్ సెంటర్ దేవస్థానం క్రీడా మైదానంలో జనవరి 9 జరిగే ఆదివాసీ అస్థిత్వ పోరాట గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్సా నర్సింహామూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో ముఖ్య కర్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమౌతున్నాయని ఆరోపించారు. వలస గిరిజనేతరుల కారణంగానే ఆదివాసీ చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. బహిరంగ సభకు ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వాసం నాగరాజు, విజయ్, రాజేష్, భవాని, రవి ఉన్నారు.

అర్హులందరికీ హక్కుపత్రాలు



మాట్లాడుతున్న సారంగపాణి

నల్లబెల్లి : అర్హులైన పోడు రైతులందరికి తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే హక్కు పత్రాలు అందించనున్నట్లు మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సారంగపాణి పాల్గొని మాట్లాడారు. పోడు రైతులకు సాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి కోటిలింగాచారి, పాలెపు రాజేశ్వర్ రావు, పిండి కుమారస్వామి, దాసి రాజు, బాదావత్ రవి, లెంకాల సాయిలు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే పుట్ట మధు బహుజనవాదం

ఎంపీపీ పంతకాని సమ్మయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

కాటారం: రాజకీయంగా లబ్ధిపొందాలనే ఉద్దేశంతో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు బహుజనవాదం అంటూ కొత్త నాటకానికి తెరతీస్తున్నారని కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆరోపించారు. కాటారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. సావిత్రిబాయి పూలే, మహనీయుల చరిత్ర, మహిళా చైతన్యం అంటూ ఓట్ల ప్రచారం పుట్ట మధుకే చెల్లుతుందన్నారు. ఈ ప్రాంతానికి విద్యావ్యాప్తికై కృషి చేసి గ్రామగ్రామానికి పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, మోడల్, కస్తూరి భా పాఠశాలలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఆశ్రమ పాఠశాలలు మంజూరు చేయించిన ఘనత శ్రీపాదరావు, శ్రీధర్ బాబుకే దక్కుతుందని పేర్కొన్నారు. పూలే దంపతుల ఆశయ సాధన కోసం పాటుపడిన వారు శ్రీపాదరావు, శ్రీధర్‌బాబు అన్నారు. దొర కేసీఆర్ కింద పని చేస్తూ పుట్ట మధు బహుజనవాదం ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ ప్రాంతానికి సంబంధించిన కాళేశ్వరం ఆలయ చైర్మన్ పదవులు స్థానికులకు ఇవ్వకుండా కేసీఆర్ మరో ప్రాంత వ్యక్తులకు ఇస్తుంటే, ఈ ప్రాంత నిధులను మరో ప్రాంతానికి తరలిస్తుంటే మాట్లాడకుండా జెడ్పీ చైర్మన్లు జీపీ చైర్మన్లుగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. లాయర్ దంపతుల హత్య కేసులో పుట్ట మధుపై కేసు నమోదు చేసి విచారించాలని ఎంపీపీ డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను ఎదిరించలేని జెడ్పీ చైర్మన్లు ప్రతిపక్ష నేత శ్రీధర్‌బాబును విమర్శించడం హేయనీయం అన్నారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు మహేశ్ రవీందర్‌రావు, సర్పంచ్ రఘురాంనాయక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కడారి విక్రమ్, ఐత రాజిరెడ్డి, గడవేణ దేవేందర్, బాంపెల్లి రాజేందర్, గట్టు సమ్మయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సిరికొండ'ను కలిసిన చల్లగరిగ వాసులు



చిట్యాల: ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారిని బుధవారం హైదరాబాదులోని కుందన్‌బాగ్‌లోని ఆయన స్వగృహంలో మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుసూదనచారి మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో చింతల రమేష్ ముదిరాజ్, కొత్త శ్రీనివాస్, బొంకూరు సమ్మయ్య, గొల్లపల్లి రాజు, మెరుగు ఉపేందర్, కోడెపాక రమేష్, తూన్‌గర్ బాబు నాయక్, నోముల రంజిత్ కుమార్, వేణు, వంక శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి ఎస్సై–2గా ప్రశాంత్



ఎస్సైకి బొకే అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి: భూపాలపల్లి ఎస్సై–2గా ప్రశాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొయ్యూర్–2 ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ డిసెంబర్ 9న భూపాలపల్లికి బదిలీ ఉత్తర్వులు రాగా, హనుమకొండలో నిర్వహించిన పోలీసు దేహదారుఢ్య పరీక్షల్లో ప్రశాంత్ విధులు నిర్వర్తించారు. ఈవెంట్స్ ముగియడంతో ఆయన విధుల్లో చేరారు.

ఎస్సైని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎస్సై ప్రశాంత్‌ను పోలీస్ స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎస్సైని కలిసిన వారిలో సంజీవయ్య మాదిగ, రేనుకుంట్ల మహేష్, పుల్ల సతీష్, శీలపాక హరీశ్‌మాదిగ ఉన్నారు.

సేవాతత్వాన్ని అలవాటు చేయాలి

● ఎంపీపీ రజిత, జెడ్పీటీసీ రుద్రమదేవి



ఉపాధ్యాయులు తయారుచేసిన బోధన ఉపకరణాలను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు

వెంకటాపురం(ఎం) : ప్రతి విద్యార్థికి సేవాతత్వాన్ని అలవాటు చేస్తూ సమాజానికి ఉపయోగపడేవిధంగా విద్యార్థులను తయారు చేయాలని స్థానిక ఎంపీపీ బుర్ర రజిత, జెడ్పీటీసీ గై రుద్రమదేవి ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులకు గణితం, ఆంగ్లం, భాష పరిసరాల విజ్ఞాన విషయాలపై ప్రాథమిక అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీఎస్ఎస్‌లో ఎంఈఓ సామల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలస్థాయి కృత్యమేళా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా వారు హాజరై ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు బోధన సులభతరం చేయడంలో ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనోపకరణాలు ఎంతగానో ఉపయోడపడతాయన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం శక్తివంచన లేకుండా పని చేయాలని సూచించారు. మండల పరిధిలోని ఉపాధ్యాయులు తయారుచేసిన 211 రకాలకు చెందిన (టీఎల్ఎం) బోధనోపకరణాలను ప్రదర్శించగా ప్రజాప్రతినిధులు, అధికారులు వాటిని తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడబోయిన అశోక్, ఎంపీటీసీ జంగిలి శ్రీలత, ఎఫ్ఎల్ఎన్ కోఆర్డినేటర్ ప్రభాకర్, ఎంపీడీఓ శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజు

కన్నాయిగూడెం : గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే ఆశ్రయం ఇవ్వొద్దని ఏటూరునాగారం సీఐ మండల రాజు అన్నారు. మండలంలోని ఐలాపూర్‌లో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో గొత్తికోయ గూడెంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ హాజరై గ్రామంలోని ఇంటింటి సోదాలు చేపట్టి గ్రామంలోని కొత్త వ్యక్తులు ఉంటే వారి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోలకి మావోయిస్టు వ్యక్తులు వస్తే వారి సమాచారం తెలుపాలన్నారు. కాదని ఎవరైనా వారి సిద్ధాంతాలకు ఆకర్షితులైతే నిండు జీవితాలు కష్టాల్లో నెట్టబడుతాయన్నారు. అనంతరం గ్రామంలో చిన్నపిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్,ప్రజలతో మాట్లాడారు. గ్రామ ప్రజలు గ్రామానికి రవాణా సౌకార్యం కల్పించాలని కోరగా సమస్యను ఉన్నత అధికారులకు తెలిపి పరిష్కారం దిశగా సహకరిస్తానన్నారు. సీఆర్పీ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినిత్, సీఆర్పీఎఫ్ పాల్గొన్నారు.